RNI NO. TELTEL2010/34557

www.deshatimes.in

# దేశ టైమ్స్ DESHA TIMES

తెలుగు దిన పత్రిక

నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్ DESHA TIMES

16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | సెప్టెంబర్ 4 శుక్రవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 211 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా

NALGONDA | FRIDAY SEPTEMBER 4 2026 | VOL:16 | ISSUE: 211 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# కొండా సురేఖకు బిగ్ షాక్.. క్యాబినెట్ నుంచి బర్తరఫ్

**కొండా సురేఖను క్యాబినెట్ నుంచి తప్పించాలని నిర్ణయం**

**సీఎంవో నుంచి రాజ్‌భవన్‌కు లేఖ వెల్లినట్లు సమాచారం**

**రాజీనామాకు సురేఖ అంగీకరించకపోవడంతో చర్యలు**

**సురేఖ కుటుంబ వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో విభేదాలు**

**కఠిన చర్యలు ప్రతిపాదిస్తూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదిక**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖను క్యాబినెట్ నుంచి తప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు సీఎం కార్యాలయం నుంచి లోక్‌భవన్‌కు లేఖ వెళ్లినట్లు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి సీఎంవోకు వచ్చిన సమాచారం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.మంత్రి పదవికి రాజీనామా చేయాలని కొండా సురేఖను అధిష్ఠానం కోరినట్లు సమాచారం. ఆమె అందుకు అంగీకరించకపోవడంతో బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

(మిగతా 2వ పేజీలో..)



## కొండా సురేఖ బర్తరఫ్.. రేవంత్ రెడ్డిని శపించిన ఆమె కుమార్తె సుస్మిత



**తెలంగాణ కేబినెట్ నుంచి మంత్రి కొండా సురేఖ తొలగింపు**

**సీఎం రేవంత్ రెడ్డిని శపించిన సురేఖ కుమార్తె కొండా సుస్మిత**

**పరకాల నుంచి పోటీ చేయాలంటూ ముఖ్యమంత్రికి సవాల్**

**తన తల్లికి అన్యాయం జరిగిందని సుస్మిత ఆవేదన**

తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు. తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, "నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం

(మిగతా 2వ పేజీలో..)

## ఏపీ, తెలంగాణలో వానలు.. అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

**తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి**

**13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**బంగాళాఖాతంలోకి మత్స్యకారులు వెళ్లవద్దని హెచ్చరిక**

తెలుగు రాష్ట్రాల్లో రానున్న కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో

(మిగతా 2వ పేజీలో..)



## మోదీని అడిగే దమ్ముందా?.. తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

**మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన**

**కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్**

**మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన**

**ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్**



తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు.తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే

(మిగతా 2వ పేజీలో..)

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

హైదరాబాద్: సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ (గురువారం) ప్రారంభించారు. స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవం అనంతరం దానిపై ఆయన ప్రయాణించారు. ఆ తర్వాత వంతెనకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ వివరాలను ముఖ్యమంత్రికి జీహెచ్ఎంసీ అధికారులు వివరించారు. దీని ప్రారంభంతో గ్రేటర్ హైదరాబాద్‌లో మరో భారీ వంతెన అందుబాటులోకి వచ్చినట్లైంది. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు: చంద్రబాబు


**వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో కనిపించని మంత్రి నిమ్మల ఫొటో**

**నిమ్మల ఫొటోను ముద్రించకపోవడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు**

**భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదని ఆదేశం**

ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వానికి సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని

(మిగతా 2వ పేజీలో..)



## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు: నారా లోకేశ్

**రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్**

**స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి**

**ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ**

రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా



(మిగతా 2వ పేజీలో..)

RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



## సంపాదకీయం

# ప్రజా సేవల్లో మార్పు.. మాటల్లో కాదు చేతల్లో కావాలి

ప్రభుత్వ పథకాల అసలు లక్ష్యం చివరి లబ్ధిదారుడికి చేరినప్పుడే అభివృద్ధికి అర్థం

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం సహజం. పాలకులు మారుతారు.. విధానాలు మారుతాయి.. ప్రాధాన్యతలు మారుతాయి. కానీ ప్రజల అవసరాలు మాత్రం కొనసాగుతూనే ఉంటాయి. సామాన్యుడికి కావాల్సింది ఏ ప్రభుత్వం అధికారంలో ఉందన్నది కాదు.. తనకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సేవ అందుతుందా లేదా అన్నదే. ఆసుపత్రిలో వైద్యం అందాలి.. పాఠశాలలో నాణ్యమైన విద్య లభించాలి.. రహదారి సక్రమంగా ఉండాలి.. తాగునీరు అందాలి.. ప్రభుత్వ కార్యాలయంలో పని సకాలంలో పూర్తవ్వాలి. ఇవే ప్రజల ప్రాథమిక అంచనాలు. ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రకటిస్తుంటాయి. బడ్జెట్లు కేటాయిస్తాయి. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు జరుగుతాయి. ప్రారంభోత్సవాలు జరుగుతాయి. కానీ ఆ పథకం వల్ల నిజంగా ఎంతమంది ప్రజలకు ప్రయోజనం కలిగింది? ఎంతమంది అర్హులు లబ్ధి పొందారు? ఎక్కడైనా మధ్యవర్తుల జోక్యం ఉందా? అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హులు నష్టపోతున్నారా? అనే ప్రశ్నలకు కూడా సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.

### పథకం ప్రకటించడం మొదటి అడుగు మాత్రమే

ఏ సంక్షేమ పథకమైనా కాగితంపై ప్రకటించడం ద్వారా ప్రభుత్వం బాధ్యత పూర్తికాదు. దాని అమలు అత్యంత కీలకం. ఒక పథకం కోసం దరఖాస్తు చేసుకున్న సామాన్యుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే.. అవసరమైన ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి ఇబ్బంది పడాల్సి వస్తే.. చివరకు తనకు రావాల్సిన ప్రయోజనం అందకపోతే ఆ పథకం ఉద్దేశమే దెబ్బతింటుంది. ప్రభుత్వ పథకాల రూపకల్పనలో ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు వాటి అమలును కూడా నిరంతరం పర్యవేక్షించాలి. అధికార యంత్రాంగంలో ప్రతి స్థాయిలో బాధ్యతను నిర్దేశించాలి. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే పరిష్కరించే వ్యవస్థ ఉండాలి.

### ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరగాలి

ప్రజా సేవల్లో వైద్య రంగానికి ప్రత్యేక స్థానం ఉంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ ఆసుపత్రులు ప్రధాన ఆధారం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం మాత్రమే కాదు.. అవసరమైన మందులు, పరీక్షలు, మౌలిక వసతులు కూడా అందుబాటులో ఉండాలి.ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని గౌరవంగా చూడాలి. వైద్య సేవలు సమయానికి అందాలి. రోగి సమస్యను ఓపికగా వినే పరిస్థితి ఉండాలి. ఒక అధికారి ఆకస్మికంగా ఆసుపత్రిని తనిఖీ చేయడం కంటే.. అక్కడి సేవలు ప్రతిరోజూ నాణ్యంగా కొనసాగుతున్నాయా లేదా అన్నదే ముఖ్యమైన విషయం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు మెరుగుపడితే దాని ప్రభావం నేరుగా సామాన్య కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై ఉంటుంది. వైద్యం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి తగ్గుతుంది. అందుకే ప్రజారోగ్య రంగంలో మౌలిక వసతులపై పెట్టుబడి ఒక ఖర్చు కాదు.. భవిష్యత్తుపై పెట్టుబడి.

### విద్యలో నాణ్యతే అసలు లక్ష్యం

అదేవిధంగా విద్యారంగంలో కూడా పాఠశాల భవనాలు నిర్మించడం, కొత్త పథకాలు ప్రకటించడం మాత్రమే సరిపోదు. విద్యార్థికి నాణ్యమైన బోధన అందుతున్నదా? ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారా? విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెరుగుతోందా? పేద విద్యార్థులకు సమాన అవకాశాలు లభిస్తున్నాయా? అన్నది పరిశీలించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే వారికి ప్రైవేటు విద్యార్థులతో సమానమైన అవకాశాలు కల్పించాలి. డిజిటల్ విద్య, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలను పాఠశాల స్థాయి నుంచే బలోపేతం చేయాలి.

### అధికారుల పనితీరే ప్రభుత్వానికి అద్దం

ప్రజలకు ప్రభుత్వం కనిపించేది ఎక్కువగా క్షేత్రస్థాయి అధికారుల రూపంలోనే. ఒక ప్రభుత్వ ఉద్యోగి ప్రజల సమస్యను పరిష్కరిస్తే.. ఆ ప్రజలకు ప్రభుత్వం పట్ల మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. అదే ఒక చిన్న పని కోసం కూడా కార్యాలయాల చుట్టూ తిప్పితే.. ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతుంది. అందుకే అధికార వ్యవస్థలో జవాబుదారీతనం పెరగాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపే విధానం మరింత బలోపేతం కావాలి. అధికారులు కేవలం ఫైళ్లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలి.

### అభివృద్ధి అంటే పెద్ద ప్రాజెక్టులు మాత్రమే కాదు

ఒక ప్రాంతంలో భారీ ప్రాజెక్టు రావడం అభివృద్ధికి సంకేతమే కావచ్చు. కానీ అదే సమయంలో గ్రామంలోని రహదారి, తాగునీరు, డ్రైనేజీ, ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వంటి మౌలిక సదుపాయాలు కూడా మెరుగుపడాలి. నగరాల్లో మెట్రో, ఫ్లైఓవర్లు ఎంత అవసరమో.. గ్రామాల్లో మంచి రహదారి, సాగునీరు, విద్యుత్, వైద్యం అంతే అవసరం. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందినప్పుడే దానికి సంపూర్ణ అర్థం ఉంటుంది. ఒక ప్రాంతం అభివృద్ధి చెందుతూ మరో ప్రాంతం వెనుకబడిపోతే సమగ్ర అభివృద్ధి సాధించినట్లు కాదు.

### ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమే

ప్రభుత్వం మాత్రమే అన్నింటినీ పరిష్కరించలేదు. ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, పన్నుల చెల్లింపు, ప్రజా వనరుల సద్వినియోగం వంటి అంశాల్లో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి.అలాగే ప్రజలు తమ సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. తప్పుడు సమాచారం, నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ వ్యవస్థను దుర్వినియోగం చేయడం వల్ల అసలు సమస్యలు పక్కదారి పడే ప్రమాదం ఉంది.

### చివరి మనిషి ముఖంలో చిరునవ్వే కొలమానం

ప్రభుత్వం ఎంత పెద్ద బడ్జెట్ కేటాయించింది అన్నదానికంటే.. ఆ నిధులతో ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చింది అన్నదే అసలు కొలమానం. ఎంతమంది కొత్త భవనాలు చూశారు అన్నదానికంటే.. ఎంతమందికి మెరుగైన సేవలు అందాయి అన్నది ముఖ్యం.ప్రజలకు అందుబాటులో ఉండే పాలన.. వేగంగా స్పందించే యంత్రాంగం.. పారదర్శకమైన విధానాలు.. అవినీతికి తావులేని వ్యవస్థ.. జవాబుదారీతనంతో పనిచేసే అధికారులు ఉంటేనే ప్రజాస్వామ్య పాలనకు బలం చేకూరుతుంది. ప్రభుత్వ పథకం చివరి లబ్ధిదారుడి ఇంటి గడప దాటినప్పుడు మాత్రమే దాని విజయం ప్రారంభమవుతుంది. కాగితాలపై కనిపించే అభివృద్ధి కంటే.. ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే నిజమైన అభివృద్ధి. లిలిప్రజా సేవల్లో మార్పు మాటల్లో కాదు.. చేతల్లో కనిపించాలి. అదే మంచి పాలనకు అసలైన నిర్వచనం.

# కొండా సురేఖకు బిగ్ షాక్.. క్యాబినెట్ నుంచి బర్తరఫ్

మొదటి పేజీ తరువాయి)

సీఎంవో లేఖను రాజ్‌భవన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాసేపట్లో గవర్నర్ కార్యాలయం నుంచి అధికారిక సమాచారం వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ వ్యవహారం వెనుక కొంతకాలంగా తెలంగాణ కాంగ్రెస్‌లో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సురేఖ కుటుంబ సభ్యుల వ్యాఖ్యలతో వివాదం మరింత ముదిరింది. సురేఖ కుమార్తె కొండా సుష్మితా పటేల్ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపాయి. ఈ పరిణామాలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం కఠినమైన నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతోంది. సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి ఢిల్లీ పెద్దలను కోరినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు బర్తరఫ్ ప్రక్రియ పూర్తయితే కొండా సురేఖ తదుపరి అడుగు ఏంటన్నదే ఆసక్తికరంగా మారింది. ఆమె పార్టీ అధిష్ఠానంతో పోరాడతారా? లేక భవిష్యత్ రాజకీయ వ్యూహాన్ని మార్చుకుంటారా? అన్నది ఉత్కంఠగా మారింది.

తెలంగాణ మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను కేబినెట్ నుంచి తొలగించాలని గవర్నర్‌కు సిఫార్సు చేసిన నేపథ్యంలో, ఈ నిర్ణయాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కనీసం తన వివరణ కూడా కోరకుండా ఏకపక్షంగా ఇటువంటి చర్యలు తీసుకోవడం భావ్యం కాదని ఆమె ఆక్షేపించారు. ఇటీవల తన కుమార్తె చేసిన వ్యాఖ్యల వల్ల తలెత్తిన వివాదంపై ఆమె స్పందిస్తూ, "నా కుమార్తె స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన మహిళ. ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలకు నేను బాధ్యురాలిని ఎలా అవుతాను? ఆమె వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం నాకు లేదు. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలను విమర్శించే హక్కు ఎవరికీ లేదు" అని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి తాను సమర్పించిన లేఖను త్వరలోనే మీడియాకు విడుదల చేస్తానని ఆమె వెల్లడించారు. గతంలో జగ్గారెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ ఎటువంటి చర్యలు తీసుకుందని ఆమె ప్రశ్నించారు. కాగా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు లేఖ రాశారు. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను బర్తరఫ్ చేయడానికే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపింది.

మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు.

## అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సీఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీ ఉత్పత్తులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో తీవ్రరూపం దాలుస్తున్న ఎల్‌నినో పరిణామాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత స్వల్ప వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర తీవ్ర వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదని, భూగర్భ జలాల ఆధారంగా అవసరమైతే అదనపు బోర్లు వేసేందుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని ఆన్నారు.

## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు: నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి)

సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## లోక్ భవన్‌కు సీఎం రేవంత్.. కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం

లోక్‌భవన్‌కు సీఎం రేవంత్ రెడ్డి
గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ
కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం
బర్తరఫ్ ఉత్తర్వులపై గవర్నర్ సంతకం
కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీ

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి లోక్‌భవన్‌కు చేరుకున్నారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ కూడా వెళ్లారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సీఎం, మంత్రులు భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజాగా నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ముఖ్యంగా కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించే అంశంపై గవర్నర్‌తో సీఎం చర్చించినట్లు సమాచారం. ఆమె బర్తరఫ్‌కు దారితీసిన పరిస్థితులను రేవంత్ రెడ్డి గవర్నర్‌కు వివరించారు. అనంతరం బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు. సీఎం ఎదురుగానే గవర్నర్ బర్తరఫ్ ఉత్తర్వులపై సంతకం చేసినట్లు తెలిసింది. దీంతో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ లోక్‌భవన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కొండా సురేఖ బర్తరఫ్‌తో తెలంగాణ కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీ అయ్యాయి. ఈ ఖాళీలను ఎవరితో భర్తీ చేయాలన్న అంశంపైనే తాజా భేటీలో ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా కొండా సురేఖ స్థానంలో ఎవరిని తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. గతంలో కాంగ్రెస్ సీనియర్ నేత మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి దక్కుతుందనే ప్రచారం జరిగింది. మరోవైపు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఈ ఇద్దరిలో ఎవరికి అవకాశం దక్కుతుందనే చర్చ మొదలైంది. లేకపోతే కొత్త ముఖాలను కేబినెట్‌లోకి తీసుకొస్తారా అన్నది కూడా ఆసక్తిగా మారింది.



## కొండా సురేఖ బర్తరఫ్.. రేవంత్ రెడ్డిని శపించిన ఆమె కుమార్తె సుస్మిత

మొదటి పేజీ తరువాయి)

నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను" అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

## ఏపీ, తెలంగాణలో వానలు.. అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, తెలంగాణలోని హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతుండగా, దానికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. దీనికి తోడు, మధ్యప్రదేశ్ నుంచి తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతోందని, వీటి ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో మత్స్యకారులు చేపల వేట కోసం బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్‌ల కింద ఉండరాదని, అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

## మోదీని అడిగే దమ్ముందా?.. తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం


# క్రీడా ప్రతిభకు మండలస్థాయి వేదిక

**కబడ్డీ.. ఖో-ఖో.. వాలీబాల్ సెలక్షన్ పోటీలు ప్రారంభం**

**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి:**

**మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి**

**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ సెప్టెంబర్ 3**





విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకుని ప్రతిభను చాటుకోవాలని మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మరిపెడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఉన్నత పాఠశాల విద్యార్థుల కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ సెలక్షన్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు తరలివచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొనడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయని అన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక రంగంలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే లక్షణం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

**మైదానంలో హోరాహోరీ పోటీలు**

మండలస్థాయి సెలక్షన్ పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మైదానంలో విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తూ హోరాహోరీగా తలపడ్డారు. తోటి విద్యార్థులు క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ కేరింతలు కొట్టడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కబడ్డీ పోటీల్లో విద్యార్థులు తమ చాకచక్యాన్ని ప్రదర్శించగా.. ఖో–ఖోలో వేగం, సమయస్ఫూర్తితో ప్రత్యర్థులను ఎదుర్కొన్నారు. వాలీబాల్ పోటీల్లో సమన్వయంతో ఆడి ఆకట్టుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**క్రీడలతో ఆరోగ్యం.. ఆత్మవిశ్వాసం**

విద్యార్థులు నిత్య జీవితంలో కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు సూచించారు. క్రీడలు శరీరాన్ని దృఢంగా ఉంచడంతో పాటు ఒత్తిడిని తగ్గించి చదువుపై ఏకాగ్రతను పెంచుతాయని తెలిపారు. పాఠశాలల్లో క్రీడలకు మరింత ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు. మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని మరిపెడ మండలానికి పేరు తీసుకురావాలని చైర్‌పర్సన్ ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు, రామ్మోహన్, రాజకుమారి, శ్రీనివాస్, రమా, రాంబాబు, నరేందర్, శ్రీకాంత్, నర్మద, రవి, ప్రభు, సునీత, మల్లేష్, నరేష్ తదితర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హామీల అమలేది.. కాంగ్రెస్ సర్కార్ మొద్దునిద్రలో!




**1,000 రోజులు గడిచినా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు..**

**ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి:**

**మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**

**ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు బీఆర్ఎస్ పోరాటం ఉధృతం చేస్తాం**

**డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి డి.ఎస్. రెడ్యా నాయక్**

**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ సెప్టెంబరు 3:**

ఎన్నికల సమయంలో ప్రజలకు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మొద్దునిద్రలో ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకురాలు సత్యవతి రాథోడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కురవిలో బీఆర్ఎస్ నిరసన**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కురవి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన అనంతరం వాటి అమలుపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదని అన్నారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని, తమ జీవితాల్లో మార్పు వస్తుందని ఆశించి కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని, అయితే వారి ఆశలు నెరవేరడం లేదని పేర్కొన్నారు.

**మాట తప్పడం ప్రజలను మోసం చేయడమే**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం ప్రజలను మోసం చేయడమేనని సత్యవతి రాథోడ్ అన్నారు. ప్రభుత్వం ఇకనైనా మొద్దునిద్ర వీడి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, హామీలను దశలవారీగా కాకుండా స్పష్టమైన కార్యాచరణతో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు. సామాన్యులు, రైతులు, పేదలు, కార్మికులు, నిరుద్యోగులు, మహిళలు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని హితవు పలికారు.

**ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తాం**

ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ వెనక్కి తగ్గబోదని మాజీ మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి హామీలను అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించి ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో హామీల అమలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ప్రభుత్వం వెంటనే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం ప్రజలతో కలిసి పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా కార్యవర్గంలో బోనకల్ నేతలకు చోటు.. గంగుల నాగేశ్వరరావు, వీరపనేని అప్పారావు నియామకం

**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 3 (దేశ టైమ్స్):**



భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులుగా బోనకల్ మండలానికి చెందిన గంగుల నాగేశ్వరరావు, వీరపనేని అప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమితులైన గంగుల నాగేశ్వరరావు, వీరపనేని అప్పారావు మాట్లాడుతూ.. పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వంద శాతం అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు బోనకల్ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. సాధారణ కార్యకర్తగా పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి బీజేపీలో తగిన గుర్తింపు, బాధ్యతలు లభిస్తాయని వారు పేర్కొన్నారు. తమకు జిల్లా కార్యవర్గంలో అవకాశం కల్పించిన పార్టీ జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు విస్తరించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని వారు అన్నారు. నూతనంగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమితులైన గంగుల నాగేశ్వరరావు, వీరపనేని అప్పారావుకు బోనకల్ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# కేసీఆర్‌కు కాంగ్రెస్ సవాల్.. వేములవాడలో భారీ నిరసన ర్యాలీ

**వేములవాడ సెప్టెంబర్ 3 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 500 మీటర్ల మేర గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు కల్వకుంట్ల కుటుంబం బాకీ ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. రేవంత్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి బావబామ్మర్దులు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడని కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌ది ఫామ్‌హౌస్ పాలన అయితే.. కాంగ్రెస్‌ది ప్రజా పాలన అని ఆది శ్రీనివాస్ అన్నారు.

# మృతుడి కుటుంబానికి సర్పంచ్ పరామర్శ

**దహన సంస్కారాలకు రూ.3 వేల ఆర్థిక సాయం**

**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ సెప్టెంబర్ 3**



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం లోని కందికొండ గ్రామానికి చెందిన వడ్డూరి వెంకటమల్లు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ తొడ్సు నాగార్జున పరామర్శించారు. వెంకటమల్లు మృతి విషయం తెలుసుకున్న సర్పంచ్ ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ కష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వెంకటమల్లు దహన సంస్కారాల నిమిత్తం రూ. 3,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ నాగార్జున అన్నారు. గ్రామంలో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా తమ వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అంబడిపూడి ఇసాకర్, బొడ్డు రమేష్, తోట మహేష్, తొడ్సు అనిత (దేవి), కందికొండ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బత్తుల వీరన్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వెంకటమల్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# నిరుద్యోగ యువతకు మంత్రి పొంగులేటి భరోసా.. ఉచిత పోలీస్ కోచింగ్‌తో ఉద్యోగ సాధనకు బాట



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 03(దేశ టైమ్స్ )**



పట్టుదల, ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన దిశగా ముందుకు సాగితే నేటి నిరుద్యోగ యువత భవిష్యత్తులో ఉద్యోగులు, అధికారులు గా స్థిరపడవచ్చని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పొంగులేటి స్వరాజ్యం--రాఘవరెడ్డి (పీఎస్ఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, రైట్ ఛాయిస్ నిర్వహణలో ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో గల రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉచిత కోచింగ్ క్యాంప్‌ను గురువారం మంత్రి పొంగులేటి ప్రారంభించారు. కలెక్టర్ దివాకర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో 2016లో సుమారు 2,300 మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఇదే విధంగా శిక్షణ అందించగా, వారిలో 350 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపికయ్యారని గుర్తుచేశారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల తల్లిదండ్రుల కళ్లలో కనిపించిన ఆనంద భాష్పాలను తాను ఎప్పటికీ మరువలేనని అన్నారు.

**“మీ శీనన్నగా అండగా ఉంటా”**

మధ్యతరగతి, నిరుద్యోగ యువత ఉన్నత భవిష్యత్తు కోసం తన వంతు సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని మంత్రి తెలిపారు. నాణ్యమైన ఫ్యాకల్టీతో పాటు రీజనింగ్ పుస్తకాలతో ఈ ఉచిత కోచింగ్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కోచింగ్‌కు హాజరయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తామని మంత్రి ప్రకటించారు. రైట్ ఛాయిస్ నిర్వాహకులు, మెండెం కిరణ్ కుమార్ చేస్తున్న కృషిని అభినందించిన ఆయన.. తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం పోలీస్ ఉద్యోగాల కోచింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వి. సీతారాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొర్రా రాజశేఖర్, అడిషనల్ డీసీపీ రామానుజం, ఐఏఎస్ ట్రైనర్ ఆకెళ్ల రాఘవేంద్రరావు, రీజనింగ్ ఫ్యాకల్టీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

RNI NO . TELTEL2010/34557 తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం


## ఆర్థిక సహాయం అందజేసిన రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి

**వలిగొండ : సెప్టెంబర్ 3:(దేశ టైమ్స్)**



మండల పరిధిలో అరూర్ గ్రామానికి చెందిన కొప్పుల శంకర్ గౌడ్ మృతి చెందిన వారి కుటుంబాని పరమర్శించి రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి 5000 రూపాయలు ఉప సర్పంచ్ గొడ్డటి సత్యం 5000 రూపాయలు గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ యాదవ్ 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వేముల అనిల్ ,గుట్ట ధర్మకర్త దామర అంజయ్య, శివాజీ యూనియన్ అధ్యక్షులు బత్తిని కర్ణ గౌడ్,కాంగ్రెస్ నాయకులు బండారు మైపాల్ రెడ్డి చిలకమర్రి ఉపేందర్ ఎలిమినేటి పెంటయ్య కొప్పుల దాసు ఎర్ర శ్రీనివాస్ లోతుకుంట లక్ష్మణ్ నల్ల రాములు బత్తిని కిష్టయ్య అధ్యక్షులు ఎర్ర సాయి గౌడ్ ఉపాధ్యక్షులు పాక మహేష్ బుర్ర శ్రీకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు.. సొంతింటి కల సాకారం: ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





**సిరిసిల్ల సెప్టెంబర్ 3 (దేశ టైమ్స్)**

సిరిసిల్ల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సిరిసిల్లలో తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి 710 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా కూలీలు, వివిధ వృత్తుల వారికి ఉపాధి లభించడంతో పాటు స్థానిక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, సొంత ఇల్లు ప్రతి ఒక్కరి కల అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ నియామకం

**రుద్రంగి సెప్టెంబర్ 3 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎఫ్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి దయ్యాల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి ఖానాపురం లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డుల సాధన, రేషన్ బియ్యం పెంపు, వికలాంగులకు చేయూత, పింఛన్ల పెంపు వంటి పలు అంశాల్లో పోరాటాల ద్వారా విజయాలు సాధించామని పేర్కొన్నారు. అనగారిన వర్గాలకు అన్యాయం జరిగినా, భారత రాజ్యాంగానికి హాని కలిగించే ప్రయత్నాలు జరిగినా ముందువరుసలో నిలిచి పోరాడుతామని అన్నారు. రుద్రంగి మండల ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడిగా దయ్యాల నరేష్, అధికార ప్రతినిధిగా తర్రి తిరుపతి, ఉపాధ్యక్షులుగా రోమల గంగారాజం, సింగారపు గంగారాజం, గౌరవ అధ్యక్షుడిగా బదుగు సంజీవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నికకు సహకరించిన ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్టా రావన్న, సీనియర్ నాయకులు గుండా థామస్, అవునూరి ప్రభాకర్‌లకు దయ్యాల నరేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సింగారపు గంగాధర్‌తో పాటు గడికంటి వెంకటి, చిట్టిపాక మల్లయ్య, సింగారపు అజయ్, కట్కూరి దాసు, నెవురి చిన్న నరసయ్య, సావన్‌పల్లి చిన్నరెడ్డి, లింగంపల్లి సుదర్శన్, అక్కెనపల్లి నరసయ్య, దయ్యాల గంగరాజం, రోమల అశోక్, అక్కనిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను దఘా చేసిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి

**వలిగొండ, సెప్టెంబర్ 03 (దేశ టైమ్స్):**

రైతులను వంచించి దఘా చేసిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర రెడ్డి, మాజీ శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి లు అన్నారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు 2వ రోజు మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు అమలు కాని హామీలు ఇచ్చి రైతులను, ప్రజలను మోసం చేశారని, రైతుకు రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా, రైతులు పండించిన దాన్యానికి మద్దతూ ధరతో పాటు బోనస్, ఎరువులు కొనడానికి యాపు దాని వల్ల రైతులు ఎంతో ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, మహిళలకు కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, నెలకు 2500, యువతకు నిరుద్యోగ భృతి, ఇది సక్రమశీగా అమలు చేయలేదని అన్నారు. రైతుల, ప్రజలను మోసగించిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, జిల్లా నాయకులు మొగుళ్ళ శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు పనుమటి మమతా నరేందర్ రెడ్డి, మాజీ మత్స్యగిరి గుట్ట చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి, ఎంపీటీసీ పలుసం రమేష్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి, మర్రి వెంకటేశం, బొల్లారశీ జాంగీర్, ఎండి అఫ్రోజ్, పబ్బు స్వామి వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపిటిసి లు, నాయకులు, కార్యకర్తల్ను తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి.. షైన్ హైస్కూల్లో ఘనంగా జన్మాష్టమి వేడుకలు







**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 03 (దేశ టైమ్స్):**

ఖమ్మం పట్టణంలోని స్థానిక షైన్ హైస్కూల్లో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల ముచ్చటైన వేషధారణలు, ఉత్సాహభరితమైన కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల ఆవరణలో ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా మార్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్వర్ పాషా మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు హిందూ ధర్మంలో శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారంగా పూజలందుకుంటున్నారని తెలిపారు. ధర్మ పరిరక్షణ, దుష్టశిక్షణ కోసం శ్రీకృష్ణుడు చేసిన బోధనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు అందించిన సందేశాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత, అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# పాలేరులో కాంగ్రెస్ జోష్.. వెయ్యి బైకులతో కూసుమంచిలో భారీ ర్యాలీ, బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి ఫైర్








**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 03 (దేశ టైమ్స్):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పాలేరు నియోజకవర్గం కూసుమంచిలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకన్‌గూడెం నుంచి కూసుమంచి వరకు సుమారు వెయ్యి బైకులతో చేపట్టిన ఈ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓపెన్‌టాప్ జీపులో ర్యాలీలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. కూసుమంచి ప్రధాన సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనను పూర్తి చేసుకుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, దళితులు, బీసీలు, మైనారిటీలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

### బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి తీవ్ర విమర్శలు

బీఆర్ఎస్ నాయకుల విమర్శలపై మంత్రి పొంగులేటి తీవ్రంగా స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 3,475 రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్ అధినేతను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని, ఇక ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని మంత్రి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

### పాలేరు అభివృద్ధికి మరింత ప్రాధాన్యం

పాలేరు నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు కేటాయించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి పొంగులేటి తెలిపారు. భవిష్యత్తులో పాలేరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ పాలనలో పాలేరు రిజర్వాయర్ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని మంత్రి ఆరోపించారు. పాలేరు రైతుల ప్రయోజనాలను విస్మరించి ఇతర ప్రాంతాలకు నీటిని తరలించారని విమర్శించారు. పాలేరు నియోజకవర్గం తనకు సొంతిల్లు వంటిదని, ఇక్కడి ప్రజలతో తన అనుబంధం విడదీయరానిదని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా పాలేరులో కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి హఫీజ్ ఉద్దీన్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, జూకూరి గోపాలరావు, కూసుమంచి సర్పంచ్ కొండా కృష్ణవేణి, పాలేరు సర్పంచ్ బానోత్ నాగేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులను దఘా చేసిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి

**వలిగొండ, సెప్టెంబర్ 03(దేశ టైమ్స్):**

రైతులను వంచించి దఘా చేసిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర రెడ్డి, మాజీ శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి లు అన్నారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు 2వ రోజు మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు అమలు కాని హామీలు ఇచ్చి రైతులను, ప్రజలను మోసం చేశారని, రైతుకు రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా, రైతులు పండించిన దాన్యానికి మద్దతూ ధరతో పాటు బోనస్, ఎరువులు కొనడానికి యాపు దాని వల్ల రైతులు ఎంతో ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, మహిళలకు కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, నెలకు 2500, యువతకు నిరుద్యోగ భృతి, ఇది సక్రమశీగా అమలు చేయలేదని అన్నారు. రైతుల, ప్రజలను మోసగించిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, జిల్లా నాయకులు మొగుళ్ళ శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు పనుమటి మమతా నరేందర్ రెడ్డి, మాజీ మత్స్యగిరి గుట్ట చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి, ఎంపీటీసీ పలుసం రమేష్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి, మర్రి వెంకటేశం, బొల్లారశీ జాంగీర్, ఎండి అఫ్రోజ్, పబ్బు స్వామి వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపిటిసి లు, నాయకులు, కార్యకర్తల్ను తదితరులు పాల్గొన్నారు.





Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280